"కావ్యతారలు"

# పూలకుండీలు

ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యాక ఏమీ తోచడం లేదు రామ్మూర్తికి. కూతురి పురిటికని అమెరికా వెళ్ళిన భార్య యింకా 3 నెలలకు కానీ రాదు. ఆఖరి కొడుకూ కోడలు ఉద్యోగరీత్యా పొద్దున్న 10 గంటలకు వెళ్ళి సాయంత్రం 6 గంటలకి గానీ రారు. ఇంట్లో ఒక్కడే ఉండే రామ్మూర్తికి కాలక్షేపం అవడం చాలా కష్టంగా ఉంది.

వేసవికాలం బాగా వచ్చేసింది. పిల్లలందరికీ స్కూళ్ళకు సెలవులు. ఆ సందులో వుండే పిల్లలతో కొంత కాలక్షేపం చేయడం అలవాటు చేసుకున్నాడు రామ్మూర్తి. పిల్లల్ని తనవైపు తిప్పుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేశాడు. షాపునుంచి బిళ్ళలూ, బిస్కెట్లూ, కొని తన దగ్గర పెట్టుకొన్నాడు. వీధిలోకి ఐస్‌క్రీం వచ్చినపుడు ఎదురుగా నుంచున్న యిద్దరు పిల్లలకి తనే కొనిపెట్టేవాడు. పిల్లలంటే రామ్మూర్తికి సహజంగానే యిష్టం. ఇంట్లో పనిమనిషి కూతురు ఆరునెలల దాన్ని ఎత్తుకు ఆడిస్తుంటే రామ్మూర్తిని చూసి యింట్లోవాళ్ళంతా నవ్వేవారు. తిరుపతి కెళ్ళినపుడు పూసల గొలుసు, చిన్న గాజులు కొంటుంటే తన భార్య, తన బావమరిది రహస్యంగా నవ్వడం రామ్మూర్తికి గుర్తే. అయితే మాత్రం తన యిష్టం తనది. తన డబ్బులు తనవి. రామ్మూర్తి యిలా అనుకుంటూ వీధిగుమ్మంలోకి చూశాడు.

'ఈ గుమ్మంలో ఆడుకోకూడదూ' అనుకొన్నాడు. అలా వీధిలోకి చూస్తూ అంతలోనే ఓ పిల్లాడు పరుగెత్తుకొచ్చి తాతగారూ! పిలిచారా అన్నాడు. "ఇక్కడాడుకోండ్రా యింత స్థలం వుందిగా", ఆ మాట అనడమే తడవుగా బ్యాటు, బాలూ పట్టుకొని బిలబిల పరుగెత్తుకొచ్చారు. పిల్లలు ముందు గదిలో పేపర్ చదువుకుంటూ మధ్య మధ్యలో పిల్లల వంక చూస్తున్నాడు రామ్మూర్తి. క్రికెట్టు బాగానే ఆడుకుంటున్న పిల్లల్ని చూసి మురిసిపోయాడు రామ్మూర్తి.

ఆ రెండోరోజు నుంచి తాతగారు పిలవనక్కర లేకుండానే పిల్లలంతా చేరి క్రికెట్ ఆడటం మొదలుపెట్టారు. అయితే సాయంత్రం నాలుగున్నర దాటాక పిల్లలెవరూ ఆడటానికి వీల్లేదని తాతగారు ముందే చెప్పడంతో కొడుకూ, కోడలూ,

ఆఫీసు నుంచొచ్చే సమయానికి రామ్మూర్తి తప్పక మరెవరూ వుండరాయింట్లో.

పూలకుండీలంటే చాలా ఇష్టం సరితకి. కుండీలో పూలు పెంచడానికి ఎంతో డబ్బు ఖర్చు చేస్తుందికూడా. ఆ ఖాళీ స్థలంలో బారులు తీరి పూల కుండీలున్నాయ్. ఎప్పుడూ పిల్లలు అటు వైపు వెళ్ళరు. ఆ రోజు బాలు వచ్చి పూలకుండీలకు తగలడం, అది వెంటనే పగిలిపోవడం క్షణాల్లో జరిగిపోయింది. రామ్మూర్తి తాతయ్య ఏమీ అనడని తెలుసువాళ్ళకి, కానీ పూలకుండీ పగిలినందుకు ఆంటీ తిడుతుందని తెల్సు, గదిలోంచి తాతగారు గబగబా బైటికి వచ్చారు. కొంచెం దూరంలో 5,6 ఖాళీ కుండీలు కన్పిస్తున్నాయి. " ఆ ఖాళీ కుండీలలో ఆ మట్టిపోసి మొక్కలు పెట్టేయండి" అన్నారు గడియారం వంక చూస్తూ, పూలకుండీలు పగలగొట్టిన వాడి మొఖం ఆనందంతో నిండిపోయింది తాతగారు ఎంత మంచివారోనని.

ఆఫీసు నుంచి వచ్చేసి టీ తాగాక పూలమొక్కల్ని ఓ మాటు చూడడం రోజూ సరితకి అలవాటు. రామ్మూర్తి గారు కిటికీ లోంచి పూలమొక్కల కేసి చూస్తున్నారు. ఇదేమిటీ ఈ గులాబి మొక్క వాడిపోయిందేమిటి అంది శ్రద్ధగా చూస్తూ. రామ్మూర్తిగారు మాట్లాడలేదు. పిల్లలెవరైనా వచ్చి పూలు కోశారా మామయ్య గారూ అంది. ఎవరూ రాందే, నేను యింట్లోనే ఉన్నాగా! కళ్ళజోడు సరిచేసుకొని కోడలు వంక చూస్తూ అన్నాడు. రామ్మూర్తి గారికి ఉన్నట్టుండి కొడుకు మీద, కోడలు మీదా చాలా కోపం వచ్చింది. తనకున్న నల్గురు సంతానంలో ముగ్గురు అమెరికాలోనే ఉన్నారు. ఆఖరి కొడుకు విజయకుమార్‌కి పెళ్ళై నాలుగు ఏళ్ళయింది. పిల్లలు లేరు. ఇటువంటి విషయాలు తనేం చెప్తాడు. ఓ పసివాడు యింట్లో ఉంటే ఎంతో సందడి, ఎంతో ఆనందం. అది వీళ్ళకు యిప్పుడు అర్థం కాదు. రామ్మూర్తి గారి కోపం భార్య మీదికి మళ్ళింది. ఆ కూతురికి పురుడు యిక్కడే పోస్తాననాల్సింది. నా భార్యను పంపను నీ భార్యనే పంపు అని ఆనాడే అల్లుడికి చెప్పాల్సింది. అదే తను చేసిన పొరపాటు. రామ్మూర్తి గారు చిరాగ్గా అటూ, ఇటూ తిరుగుతున్నారు గదిలో.

'మావయ్య గారూ నా కోసం ఫోన్లు ఏమైనా వచ్చాయా?'

'ఏమీ లేవ్!' అన్నారు కోపంగా! తర్వాత గుర్తొంచ్చింది.

'మీ చెల్లెలు ఫోన్ చేసింది. రాత్రి బస్సులో బయలుదేరి వస్తుందట.'

'ఎన్ని గంటల బస్సులో'

'ఏమో నాకు తెలియదు'

సరితకి చాలా చిరాకనిపించింది. ఎన్నిగంటల బస్సులో వస్తుందో తెలియకుండా తను బస్టాండుకి ఎలా వెళ్తుంది?

'మీరు వివరంగా కనుక్కోవాల్సింది!' అంది నెమ్మదిగా.

'బస్టాండు దాకా వచ్చింది యింటికి రాదా!'

సరితకి చాలాసార్లు యిలాంటి విషయాల్లోనే మామగారి పైన విసుగొస్తుంది. రామ్మూర్తికి ఎందుకో విసుగ్గానే ఉంది ఆరోజు.

'నాన్నగారు నాకేమైనా లెటర్స్ వచ్చాయా' అంటూంటాడు కొడుకు.

'పనిమనిషి వచ్చి వెళ్ళిపోయిందా' అంటుంది కోడలు

'ఆంటీ లేదా, కొంచెం తోడుకి పెరుగివ్వండి' అంటుంది పక్కింటి చిన్ని. 'పొద్దున మా ఫ్రెండు ఫోన్ చాశాడటగా! చెప్పలేదేం అని కసురుకుంటాడు కొడుకు.

వీటన్నింటికి సమాధానం చెప్పడమే కాకుండా పాల ప్యాకెట్టు లోపం పెట్టడం, గ్యాసు సిలిండరొస్తే వంటింట్లో పెట్టించడం వంటి ఎన్నెన్నో తను చేస్తున్నందుకు తనపై తనే కోపం తోచ్చుకున్నాడు రామ్మూర్తి. హాయిగా అమెరికా వెళ్ళక యిక్కడున్నందుకు, రిటైరైనా ఏదో చిన్న పనిలో జేరిపోయి హాయిగా 10 గంటల నుంచి 5 గంటల వరకు బయట గడపకుండా యింట్లోనే వున్నందుకూ...

రేపట్నుంచి ఈ పనులేమీ నేను చెయ్యను అని అనుకున్న రామ్మూర్తిగారు టీ.వీ చూస్తున్న కొడుకు పక్కన కూర్చున్నారు. అన్నీ మర్చి పోయారు. "వాణ్ణి చూస్తే ముద్దొస్తుంది కదూ" అన్నారు టీ.వీలో చూపిస్తూ, 'ఎవణ్ణి' అన్నాడు కొడుకు టీ.వీ. వంక కంటిరెప్ప వేయకుండా

'వాడే ఆ సచిన్'

ఈ పెసరట్లు తింటూ టీ.వీ చూడండి యింకా బావుంటుంది అంటూ కోడలు రెండు ప్లేట్లు తెచ్చి బల్లముందు పెట్టింది.

రోజూ క్రికెట్టాట ఆడుకోవడం, బంతి వెళ్ళి పూలకొమ్మలకు తగిల్తే, ఆ విరిగిపోయిన కొమ్మల్ని ఎవరికంటా పడకుండా బయట పారేసి రావడం, అప్పుడప్పుడూ పూలకుండీలు పగిలితే వున్న ఖాళీ కుండీలలో మట్టి నింపేసి మొక్కను పెట్టేయడం అలవాటుగా చేసేస్తున్నారు ఆడుకోవడానికి వచ్చే పిల్లలు.

ఓ కునుకు తీసి తేచిన రామ్మూర్తి గారి దృష్టి పూలకుండీల మీద పడింది. ఆరు ఖాళీ కుండీలకు బదులు మూడే వున్నాయి. వీటి పైన కోడలి చూపు పడనందుకు కొంత సంతోషించాడు. ఇలా కుండీలు పగలకొడితే మీరు ఆడొద్దని పిల్లల్ని మందలించాడు. అంతేకాకుండా ఈ పిల్లల్లో కాస్త పెద్దవాణ్ణి పిలిచి ఆ గుడి సందులో

ఈ కుండీలు అమ్ముతారు యిదే సైజువి మూడు పట్రా అన్నారు డబ్బులిస్తూ.

నాల్గురోజుల తర్వాత తన స్నేహితురాలికి గార్డెన్ చూపిస్తున్న సరిత ఒక్కక్షణం ఆశ్చర్యపోయింది. కొత్తకుండీలు మూడు కన్పిస్తున్నాయ్. మూడూ మూడు రకాల సైజులవి. గబగబా కోపంగా లోపలికొచ్చింది.

"ఈ ఖాళీ కుండీలు ఎవరెత్తుకు పోతున్నారూ!" అంది.

'అంటే!'

'మంచి కుండీలు ఎత్తుకుపోయి, కొత్తకుండీలు మూడు పెట్టారు ఎవరో! మీరే ఎవరికో దానం చేసుంటారు' అంది కోపంగా!

'నాకేం తెల్సు! ఇంట్లోకెవరూ రాకుండా కాపలా కాస్తున్నాను! అయినా నువ్వు మరోసారి సరిగ్గా చూడు.'

సరిత, ఈ ముసలాయనతో మాట్లాడటం అనవసరం అనుకుంది. పనిమనిషే పెద్ద కుండీలు తీసుకుపోయి, చిన్న కుండీలు యిక్కడ పెట్టి వుంటుంది అనుకుంది. మరో 15 రోజులు గడిచింది. స్నేహితురాలి కోసం సెలవుపెట్టి యింట్లో ఉన్న సరిత, వంటింట్లో పనులు చేసుకొని బయటి కొచ్చేసరికి, పిల్లలంతా ఉత్సాహంగా క్రికెట్ ఆడుతూ కనిపించారు. గదిలో మామగారు లేరు. ఉత్సాహంగా వేసిన బంతి ఎదురుగా ఉన్న పూలకుండీకి తగలడం అది టక్కున పగలడం క్షణంలో జరిగింది. సరితను చూడగానే పిల్లలు బిక్కమొహం వేశారు. అందరూ పారిపోయారు.

బ్యాటూ, స్టంపులూ పట్టుకొని యిద్దరు పిల్లలు నుంచున్నారు. సారీ! ఆంటీ! రోజూ జాగ్రత్తగానే ఆడుకుంటున్నాం ఆంటీ! వీడే, వద్దంటే ఫాస్ట్ బౌలింగ్ అంటూ స్పీడ్‌గా బాల్ విసిరాడు. సరితకి విషయం అంతా అర్థమైపోయింది. రోజూ వీళ్ళు ఆడుకుంటున్నారు. పూలకుండీలు పగులకొడ్తున్నారు. కొత్తకుండీలు తెచ్చి పెడుతున్నారు. ఇదంతా మామగారికి తెలియదూ

కొడుకుతో తను చూసిన ఇంగ్లీషు సినిమా ముచ్చట్లు చెప్తున్న రామ్మూర్తి దగ్గరికి వచ్చి "మట్టి కుండీలైతే పగులుతాయి, అందుకని ప్లాస్టిక్ కుండీలు తెప్పిస్తున్నాను" అంది మామగారు వినేలా సరిత.

"కుండీలేమిటి? విరగడమేమి? నువ్వేం చెప్తున్నావో అర్థం కావడం లేదు అన్నాడు "రామ్మూర్తి నవ్వుతూ.

మట్టి కుండీలేగా! పగిలితే మళ్ళీ కొనుక్కోవచ్చుగా! అన్న భర్త మాటలకి

కోపం వచ్చి, యింక పూలమొక్కల్నే పెంచను లెండి అంది.

తండ్రీ కొడుకులు పూల మొక్కల గురించి మాట్లాడుకున్నట్లు, పూలకుండీలు పగిలితే కొనుక్కోవచ్చు గానీ, పిల్లలు క్రికెట్టు ఆట మానకూడదని నిర్ణయించినట్లు సరితకు తెలియదు పాపం.

కానీ కొన్ని రోజులయ్యాక, క్రికెట్ ఆడుకునే పిల్లల్ని తనగది కిటికీలోంచి రహస్యంగా చూసి, 'పాపం పిల్లల్ని ఆడుకోనీ' అని మనసులో అనుకుంటున్న సరితను మామగారు, భర్తా గమనించారన్న విషయమూ తెలియదు పాపం సరితకి.

ఓ రోజు సరితకి, ఈ పూలకుండీలన్నీ వెనక దొడ్డివైపు పెట్టేసి, పిల్లల్ని హాయిగా క్రికెట్ ఆడుకోమంటే ఎంత బాగుంటుంది – ' ఈ ఫ్లాట్లు సంస్కృతిలో నేల, ఆకాశం చూడని పిల్లలు ఎక్కడాడుకుంటారు?'

వారం రోజులయ్యే సరికి పిల్లలతో కలిసిపోయిన సరితని 'ఆంటీ మీరూ ఆడండి అంటూ పిల్లలు చుట్టూ మూగుతుంటే, ఆడాలనే అనిపించింది, కానీ మామగారేమన్న అంటారని భయం వేసింది.

"తాతగారు ఊరెళ్ళాక" రహస్యంగా అంది సరిత.

"ఇంటింటి చిత్రాలు" –"మూసీ"–

– సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక మే 2000